క్లుప్తంగా

రుచికరమైన భోజనం అందించాలి

పాలసముద్రం: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని రుచికరంగా అందించాలని ఎంఈఓ గిరిజ తెలిపారు. మంగళవారం వెంగళరాజుకుప్పం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని ఆమె పరిశీలించారు. విద్యార్థులతో కలసి భోజనం చేశారు. మధ్యాహ్నం భోజనం మెనూపై ఆరా తీశారు. మధ్యాహ్న వండుతున్న పాత్రలను సబ్బుతో శుభ్రం చేసిన తరువాతనే భోజనం చేయాలని హెచ్చరించారు. అనంతరం విద్యార్థులకు చేసిన భోజనాన్ని వారితో కలసి తిన్నారు. కార్యక్రమంలో సీఆర్పీ శరవణన్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో అన్నదానం


అన్నదానం చేస్తున్న డాక్టర్ ప్రవీణ్

గంగాధరనెల్లూరు: మండలంలోని జీడీనెల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వీఎం కేశవరెడ్డి మెమోరియల్ ఫౌండేషన్, రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో మంగళవారం రోగులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులు ఆకలితో ఉండకూడదనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని రెడ్‌క్రాస్ మండల చైర్మన్ పాపిరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించిన డాక్టర్ ప్రవీణ్, హెల్త్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ కృష్ణయ్య, సూపర్‌వైజర్ భగవతి, వైద్య సిబ్బంది కదిరివన్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు


గ్రామ దేవతకు అంబళ్లు

పాలసముద్రం: మండలంలోని చెరువుముందరకండ్రిగ గ్రామంలో మంగళవారం గంగమ్మ తల్లి జాతర నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేసి, పుర వీధుల్లో ఊరేగింపు చేపట్టారు. ఉదయం గ్రామ దేవతకు పంబ వాయిద్యాలతో ప్రతి ఇంటి నుంచి మహిళలు అంబలి తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. సాయంత్రం పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. రాత్రి గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి, గ్రామాల్లో పంబ వాయిద్యాలతో గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు.

రాజు సేవలు స్ఫూర్తిదాయకం


రాజును సన్మానిస్తున్న పోలీస్ సిబ్బంది

పుత్తూరు: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏఎస్‌ఐగా పనిచేసిన భక్తవత్సలంరాజు సేవలు స్ఫూర్తిదాయకమని సీఐ శేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో భక్తవత్సలంరాజు ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ఎన్నో కీలకమైన కేసుల్లో ముద్దాయిలను చాకచక్యంతో పట్టుకున్న ఘనత రాజుకు ఉందన్నారు. ఆయన స్ఫూర్తితో సిబ్బంది పనిచేయాలని సూచించారు. అనంతరం భక్తవత్సలంరాజు దంపతులను పోలీసు సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ ఓబయ్య, సిబ్బంది పాల్గొన్నారు.


రైతులతో కలిసి అన్నదాత పోరు నిర్వహిస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా

రైతన్న కన్నెర్ర

- అన్నదాత పోరుకు మాజీ మంత్రి ఆర్కే రోజాతో కలిసి కదం తొక్కిన రైతులు
- పోలీసు బెదిరింపులు లెక్క చేయని శ్రేణులు

నగరి: సమస్యలు పరిష్కరించాలంటూ రైతులు కన్నెర్ర చేశారు. సమస్యల పరిష్కారంలో రైతుకు అండగా నిలబడడానికి వైఎస్సార్ సీపీ చేపట్టిన అన్నదాత పోరు కార్యక్రమంలో పాల్గొని, కదం తొక్కారు. పోలీసుల ఆంక్షలు, సామాజిక మాధ్యమాల్లో చేసిన సూచనలు, కేసులు పెడతామంటూ చేసిన బెదిరింపులు వారిని ఆపలేకపోయాయి. దీంతో పట్టణ పరిధిలోని టవర్‌క్లాక్ సెంటర్ మహానేత విగ్రహ ప్రాంగణం పార్టీ శ్రేణులు, రైతులతో నిండిపోయింది. రైతు బాంధవుడు, దివంగత మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలదండలు వేసి నివాళుర్పించారు. వారు ప్లకార్డులు, ఫ్లెక్సీలు చేతబట్టి నిరసన ర్యాలీని ప్రారంభించారు. రైతులకు వ్యతిరేకంగా ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును వెలుగెత్తి చూపే నినాదాలతో ముందుకు సాగారు. అన్నదాత ఆగ్రహ నినాదం ర్యాలీలో ఆద్యంతం వినిపించింది.

అడుగడుగునా ఆంక్షలు

మాజీ మంత్రి ఆర్కే రోజా ఆధ్వర్యంలో భారీ ర్యాలీగా ఆర్డీఓ కార్యాలయం వద్దకు అందరూ చేరుకున్నారు. అందులో పది మందికి మాత్రమే పోలీసులు ఆర్డీఓ వద్దకు వెళ్లేందుకు అనుమతిచ్చారు. దీంతో మాజీ మంత్రి ఆర్కే రోజాతోపాటు పది మంది రైతులు, నేతలు ఆర్డీఓను కలిసి రైతు సమస్యలు పరిష్కరించాలంటూ వినతిపత్రం అందించారు. అనంతరం మాజీ మంత్రి ఆర్కే రోజా మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నదాత పోరుకు పిలుపునిచ్చిన తరువాతే ప్రతి సమస్య పరిష్కారం దిశగా వెళ్తోందన్నారు. ఇదే పొగాకు, మిర్చి, మామిడి రైతుల విషయంలో జరిగిందన్నారు. నేడు ఎరువులు, యూరియా లేక రైతులు పడే కష్టాలపై జగనన్న పోరుకు పిలుపునివ్వగానే ఆగమేఘాలపై యూరియా, ఎరువులు వచ్చేశాయంటూ అధికారులు ప్రకటనలిస్తున్నారన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలోని రైతులు పలువురు ఇక్కడ ఎరువులు, యూరియా లేక పళ్లిపట్టు, ఎస్ఎస్ కండ్రిగ, తిరుత్తణి, పొదటూరుపేటలకు వెళ్లి తెచ్చుకుంటున్నారన్నారు. బస్తాకు రూ.30 నుంచి రూ.40 అదనంగా చెల్లించడమే కాక ట్రాన్స్‌పోర్టు చేసుకోవడానికి బస్తాకు రూ.60 చెల్లించాల్సి వస్తోందన్నారు.

దోపిడీతోనే యూరియా కొరత

ఇసుక, మట్టి, భూములు, ట్రాన్స్‌ఫార్మర్లు అడ్డదిడ్డంగా దిగమింగుతున్న కూటమి నేతలు నేడు రైతులకు ఇవ్వాల్సిన యూరియాను కూడా దోచుకుంటున్నారన్నారు. రైతులకు అండగా నిలబడేందుకు వైఎస్సార్ సీపీ ముందుకు వస్తే సపోర్ట్ చేసే నాయకులపై రౌడీషీట్లు పెడతాం అంటూ ఎస్పీనే చెబుతున్నారంటే పోలీసు యంత్రాంగం పాలక ప్రభుత్వానికి ఎలా తొత్తుగా ప్రవర్తిస్తుందో ఇట్టే అర్థమవుతోందన్నారు. రాష్ట్రంలో నేడు మహిళలకు భద్రత లేదని, యువతకు ఉద్యోగాలు లేవని విమర్శించారు. అన్నింటిపైనా వైఎస్సార్ సీపీ పోరాడుతూనే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి గుణశేఖర్ రెడ్డి, పంచాయతీరాజ్ విభాగ కార్యదర్శి గోవర్ధన్‌నాయుడు, ప్రచార విభాగ కార్యదర్శి శేఖర్ రాజు, ఎస్సీసెల్ కార్యదర్శి శ్యామ్‌లాల్, జిల్లా రైతు సంఘ అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి, నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షుడు తోయజాక్షరెడ్డి, నగరి, పుత్తూరు మున్సిపల్ చైర్మన్లు నీలమేఘం, హరి, వైస్ చైర్మన్లు జయప్రకాష్, బాలన్, శంకర్, ఎంపీపీలు భార్గవి, మునివేలు, దీప, విజయలక్ష్మి, జిల్లాపార్టీ కార్యదర్శి అనిల్, ఉమ్మడి జిల్లా క్రియాశీలక కార్యదర్శి మురుగ, పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు రమేష్‌రెడ్డి, తిరుమలరెడ్డి, ఏకాంబరం, శివరాజు, వేణురాజు, సుబ్రమణ్యం రెడ్డి, మండల రైతు సంఘ నాయకులు, వైస్ ఎంపీపీలు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ కమిటీలు, అనుబంధ కమిటీల నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్నమాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఇన్‌చార్జి కృపాలక్ష్మి

కూటమి ఆంక్షలకు బెదిరేది లేదు


రైతులకు మద్దతుగా బైక్ ర్యాలీలో పాల్గొన్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

శ్రీరంగరాజపురం: కూటమి ప్రభుత్వం పెట్టే ఆంక్షలకు వైఎస్సార్ సీపీ భయపడదని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. మండలంలోని 49 కొత్తపల్లిమిట్టలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎరువులను బ్లాక్ మార్కెట్‌తో కృత్రిమ కొరత సృష్టిస్తూ అధిక ధరలతో రైతన్నలను దగా చేస్తోందన్నారు. అన్నదాతలపై చూపిస్తున్నా వివక్షను ఖండిస్తూ వారికి అండగా అన్నదాత పోరుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వీర్యం చేయడానికి కూటమి ప్రభుత్వం ఆంక్షలు విధించడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు నుంచి అన్నదాతలకు కష్టాలు మొదలయ్యాయని అన్నారు. రాష్ట్ర ప్రజలు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కూటమి పార్టీలకు బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని జోస్యం చెప్పారు. రాష్ట్రంలోని అన్నదాతల్లో చిరునవ్వు రావాలంటే జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరారు.

అరాచకాలను ఎదుర్కొందాం

కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలు, రైతులపై చేస్తున్న అరాచకాలను ఎదుర్కొందామని వైఎస్సార్ సీపీ గంగాధరనెల్లూరు ఇన్‌చార్జి కృపాలక్ష్మి అన్నారు. మామిడి రైతులకు ఇస్తామన్న గిట్టుబాటు ధర ఇంతవరకు ఎందుకు చెల్లించలేదని ప్రశ్నించారు. చిత్తూరు జిల్లా వ్యాప్తంగా మామిడి రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నదాతల కోసం రానున్న రోజుల్లో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మరిన్ని పోరాటాలు చేస్తామన్నారు. అనంతరం 49 కొత్తపల్లిమిట్ట నుంచి గంగాధరనెల్లూరు నియోజక వర్గానికి చెందిన ఆరు మండలాల కన్వీనర్లు, రైతులు, వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున చిత్తూరు ఆర్డీఓ కార్యాలయానికి భారీ బైక్ ర్యాలీగా తరలివెళ్లారు.

నేడు పుత్తూరులో విద్యుత్ అదాలత్

పుత్తూరు: స్థానిక విద్యుత్ డివిజన్ కార్యాలయం వద్ద బుధవారం మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 5.50 గంటల వరకు ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఏపీ ట్రాన్స్‌కో ఏఈఈ జైసాయి ఒక ప్రకటనలో తెలిపారు. పుత్తూరు డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే విద్యుత్ అదాలత్ కార్యక్రమంలో చైర్‌పర్సన్ వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యులు, ఇన్‌చార్జి జి.మధుకుమార్, స్వతంత్ర సభ్యులు విజయలక్ష్మీ పాల్గొంటారని తెలిపారు. ఈ అదాలత్‌లో దీర్ఘకాలిక సమస్యలను సైతం రాత పూర్వకంగా తెలియపరచి పరిష్కరించుకోవచ్చునని వెల్లడించారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నగరిలో..

నగరి/గంగాధరనెల్లూరు: సబ్ డివిజన్ పరిధిలోని జీడీనెల్లూరు టౌన్‌లో నగరి మున్సిపాలిటీ, నగరి రూరల్, పన్నూరు, నింద్ర సెక్షన్లకు సంబంధించిన ప్రత్యేక విద్యుత్ అదాలత్ బుధవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు విద్యుత్ శాఖ ఏడీ వెంకటముని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థకు చెందిన వినియోగదారులు ఫిర్యాదుల పరిష్కారానికి సంబంధించిన అధికారులు, సిబ్బంది ఈ అదాలత్‌కు హాజరవుతారన్నారు. విద్యుత్ వినియోగదారులు పరిష్కారం కాని దీర్ఘకాలిక సమస్యలు రాతపూర్వక ఫిర్యాదు ద్వారా తెలియపరచి వారి సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

యూటీఎఫ్ రణభేరికి తరలిరండి


రణభేరి పోస్టర్ల ఆవిష్కరణలో యూటీఎఫ్ నాయకులు

- జిల్లా ప్రధాన కార్యదర్శి మణిగండన్

నగరి: ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన ఆర్థిక, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఈ నెల 15న చిత్తూరు జిల్లా కుప్పంలో ప్రారంభమై వి.కోట, పలమనేరు, చిత్తూరు, నగరి మీదుగా తిరుపతి జిల్లాకు ప్రవేశించే యూటీఎఫ్ రణభేరి బైక్ జాతా విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి మణిగండన్ పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం స్థానిక పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద రణభేరికి సంబంధించిన పోస్టర్లను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి సర్వీస్ రూల్స్ ద్వారా ప్రమోషన్ కల్పించాలని, పాఠశాలలో ఒత్తిడి లేకుండా పనిచేసే వాతావరణం కల్పించాలని, ఆర్థిక బకాయిలను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కౌన్సిలర్ పి.ఆర్.మునిరత్నం మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుండి మినహాయించాలని, 12వ పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు కె.వంశీకృష్ణ మాట్లాడుతూ మెమో నెంబర్ 57 వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు యువరాజ్, రూబన్, హరీష్, ప్రకాష్, సంతోష్, జనార్ధనన్, బీజే సురేష్, రమేష్, గణేష్, జయశంకర్, మునికృష్ణారెడ్డి, సురేష్, భాగ్యరాజ్, సంజీవి, షణ్ముగం, ఉలగనాథం, పయణి, నిషార్ పాల్గొన్నారు.

వైభవంగా గ్రామ దేవతల ఉత్సవాలు


ఇనుపకొక్కీలకు వేలాడుతూ ఛాతీకి ఉన్న కొక్కీలతో అమ్మవారి విగ్రహాన్ని తీసుకెళ్తున్న భక్తులు

నగరి: మున్సిపల్ పరిధి కేవీపీఆర్ పేటకు గ్రామ దేవతలైన పొన్నియమ్మ, ఎల్లమ్మ, ఏకాంబరకుప్పం ప్రాంతానికి గ్రామ దేవత తొప్పయమ్మ దేవతలకు జాతరలో భాగంగా ఊరేగింపు ఉత్సవాలు మంగళవారం వైభవంగా సాగాయి. ఆనవాయితీ మేరకు స్థానిక భక్తులు పసుపు వస్త్రాలు ధరించి ఉదయం బుగ్గదేవాలయం నుంచి పవిత్ర జలాలను సేకరించి ఆ కలశాలతో ఊరేగింపుగా గ్రామదేవతల ఆలయాలకు చేరుకున్నారు. పవిత్రతను నిరూపించే దిశగా నోటికి గుడ్డలు కట్టుకొని పుష్పపు త్రిశూలం, అమ్మవార్ల విగ్రహాలు తలపై పెట్టుకొని వచ్చిన వీరు పలువురిని ఆకర్షించారు. ఆయా ప్రాంతాల వద్ద గ్రామపెద్దలు వీరికి మంగళ వాయిద్యాలు, కోలాటాలతో స్వాగతం పలికారు. ఊరేగింపుగా తీసుకువచ్చిన పవిత్ర జలంతో ఆలయాల్లోని అమ్మవారి ప్రతిమలకు అభిషేకం చేశారు.

గగుర్పొడిచే విన్యాసాలు

ప్రతి ఏడాది ఉత్సవాలను పురస్కరించుకొని ఈ ప్రాంతంలోని యువకులు మొక్కులు తీర్చుకునే పద్ధతులు గగుర్పొడిచే విధంగా ఉంటాయి. అగ్గిసట్టి తలపై తీసుకురావడం, నోటిలో శూలాలు గుచ్చుకోవడం, శరీరమంతా శూలాలు గుచ్చుకోవడం, వీపు, కాళ్లకు, చేతులకు ఇనుప కొక్కీలు పొడిపించుకొని వాహనాలపై పడుకొని, కూర్చుని వేలాడటం, వీపునకు కొక్కీలు తగిలించుకొని వేలాడుతూ ఛాతీకి పొడుకున్న కొక్కీలతో అమ్మవారి విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లడం, తమ వీపులకు పొడిపించుకున్న ఇనుప కొక్కీలకు కట్టిన దారాలను వాహనాలకు కట్టి లాగడం తదితర సాహసోపేత మొక్కుబడులను ఇక్కడి భక్తులు తీర్చుకున్నారు.

పూడి సచివాలయంలో చోరీ

వడమాలపేట(పుత్తూరు): వడమాలపేట మండలం పూడి సచివాలయంలో ఆదివారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్‌ఐ ధర్మారెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం కార్యాలయానికి వచ్చిన సిబ్బంది చోరీ జరిగిన విషయాన్ని గ్రహించి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించగా కార్యాలయం బీగాలు పగొలకొట్టి లోనికి చొరబడిన దుండగులు 3 ప్రింటర్లు, 2 ల్యాప్‌ట్యాప్‌లను అపహరించుకొని పోయినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

భారీగా జాతర ఏర్పాట్లు


వరలక్ష్మి అలంకరణలో ఓరుగుంటాలమ్మ


సింహవాహిని అలంకరణలో దేశమ్మ దేవత


గంగమ్మ


జాతర ప్రాంతంలో ఏర్పాటు చేసిన పార్వతీ మహాశివలింగ ప్రతిమ

- నేడు నగరి గంగమ్మ జాతర
- అలరించిన ఓరుగుంటాలమ్మ, దేశమ్మ అలంకరణలు
- అదనపు శోభనిస్తున్న విద్యుత్ దీపకాంతులు
- టీటీడీ సహకారంతో చలువపందిళ్లు

నగరి: పట్టణంలో గంగమ్మ జాతరకు ఎంతో ప్రాశస్త్యం ఉంది. ఈ జాతరతోపాటు పరిసరాల్లో ఉన్న 15 గ్రామాల్లో జాతర జరుగుతుంది. దీంతో ఈ జాతర ప్రత్యేకతను సంతరించుకుంది. మంగళవారం ఉదయం నుంచే గంగమ్మ కొలువుదీరే ప్రాంతం, దేశమ్మ, ఓరుగుంటాలమ్మ ఆలయాల వద్ద మహిళలు భారీ సంఖ్యలో పొంగళ్లు పెట్టారు. ఇప్పటికే గంగమ్మ దర్శనానికి భక్తుల రద్దీని నియంత్రించడానికి ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. జాతర మొక్కుబడులలో ప్రధానమైన వెయ్యికన్నుల దుత్త, అగ్గిసట్టి విక్రయాలు ఊపందుకున్నాయి. వేపాకు సారెను సమర్పించేందుకు యువకులు వేపాకు రెమ్మల సేకరణలో నిమగ్నమయ్యారు. ప్రధాన రహదారి పొడవునా విద్యుత్ దీపాల కాంతులు జాతరకు అదనపు శోభనిస్తున్నాయి. జాతరలో చిన్నారులను ఆకట్టుకునే భారీ రంగుల రాట్నాలు ఏర్పాటయ్యాయి. టీటీడీ వారు ఆలయం వద్ద భారీఎత్తున చలువ పందిళ్లు ఏర్పాటు చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. టీటీడీ వారు చలువ పందిళ్లు, శ్వేతవస్త్రాలు, పుష్పాలు జాతరకు అందించే సాంప్రదాయానికి రెండేళ్ల క్రితం మాజీ మంత్రి ఆర్కే రోజా నాంది పలికిన విషయం విదితమే. ఆ సాంప్రదాయం అలాగే కొనసాగుతోంది. జాతర నిర్వహణ ప్రాంతాన్ని డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్, సీఐ విక్రమ్ సిబ్బందితో పాటు పరిశీలించారు. పలు ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేశారు.

కొలువుదీరనున్న అక్కచెల్లెళ్లు

నగరి గంగ జాతరకు చారిత్రక విశిష్టత ఉంది. నగరి పట్టణానికి గ్రామదేవతలైన అక్కచెల్లెళ్లుగా చెప్పుకునే ఓరుగుంటాలమ్మ, దేశమ్మ, గంగమ్మ ఊరి మధ్యలో నిర్వహించే జాతర ప్రాంతంలో కొలువుదీరడం ఆనవాయితీ. చారిత్రక కథనం మేరకు గంగమ్మకు పెద్దక్క ఓరుగుంటాలమ్మ, చిన్నక్క దేశమ్మ. ఊరికి పడమర ఓరుగుంటాపురంలో ఓరుగుంటాలమ్మ, తూర్పున టీఆర్ కండ్రిగలో దేశమ్మ కొలువుదీరి గ్రామదేవతలుగా గ్రామాన్ని రక్షిస్తుంటారని ప్రతీతి. ఉగ్రరూపిణి అయిన గంగమ్మ ఏడాదికోమారు నిర్వహించే జాతరలో ఊరిమధ్యలో కొలువుదీరి దుష్టశక్తులను హరించి వేస్తుందన్నది నమ్మకం. గంగమ్మకు ప్రతిరోజు నైవేద్యం పెట్టడానికి వీలుకాదని అందుకే ఏడాదికోమారు ఊరి మధ్యలోకి తీసుకువచ్చి కుంభాల కూడు పెట్టి సంతృప్తిగా పొలిమేర దాటిస్తారంటారు. చెల్లెలికి స్వాగతం పలకడానికి అక్కలైన ఓరుగుంటాలమ్మ, దేశమ్మలు జాతర జరిగే ప్రాంతానికి వస్తారని ఇక్కడి ప్రజల నమ్మకం. ఈ సాంప్రదాయం మేరకు జాతర ప్రాంతానికి ఓరుగుంటాలమ్మ వరలక్ష్మి అవతారంలో, దేశమ్మ దేవత సింహవాహిని రూపంలో జాతర నిర్వహణ ప్రాంతంలో ఏర్పాటు చేసిన పందిళ్లకు చేరుకున్నారు. దేవతల అలంకరణలు ప్రజలను ఆకట్టుకున్నాయి. అర్ధరాత్రికిపైగా వేపాకు పందిరికి గంగమ్మ చేరుకుంది.

కొత్త హంగులు

ఈ ఏడాది జాతర ఉత్సవాలను పురస్కరించుకొని జాతర ప్రాంతంలో కొత్తగా ఏర్పాటుచేసిన పార్వతీ మహాశివలింగ ప్రతిమలు, వినాయక, సుబ్రమణ్య ప్రతిమలు భక్తులకు అమితంగా ఆకట్టుకుంటున్నాయి. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన క్యూలైన్లలో వెళ్లి భక్తులు మహాశివలింగ దర్శనం చేసుకున్నారు.


అబ్బురపరుస్తున్న విద్యుత్ దీపాలంకరణలు

ఘర్షణలో ముగ్గురికి గాయాలు

గంగాధరనెల్లూరు: మండలంలోని అంబోదరపల్లి గ్రామంలో రెండు కుటుంబాలు ఘర్షణ పడడంతో ముగ్గురు వ్యక్తులు తీవ్ర గాయాలతో ఆసుపత్రి పాలైన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానిక పోలీసుల వివరాల మేరకు అంబోదరపల్లి గ్రామానికి చెందిన బాబు కుటుంబ సభ్యులు అదే గ్రామానికి చెందిన బాలకృష్ణ కుటుంబ సభ్యులు పాత కక్షలతో వాగ్వాదానికి దిగారు. ఇది తీవ్రం కావడంతో బాబు మద్యం మత్తులో బాలకృష్ణ కుటుంబ సభ్యులపై దాడి చేశారు. ఈ దాడిలో బాలకృష్ణ కుటుంబ సభ్యులు మురుగన్, శశి, శోభ తీవ్ర గాయాల పాలయ్యారు. మొదట తూగుండ్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొంది, మెరుగైన చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి బంధువులు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా బాలకృష్ణ సమీప బంధువు వరదన్ ఫిర్యాదు మేరకు బాబుతో సహా ఏడుగురిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు జీడీనెల్లూరు పోలీసులు తెలిపారు.